
కొత్తపేట ఆలయంలో..


ఖిల్లాఘనపురంలో..


మూలమల్లలో..


ఆత్మకూర్ పరమేశ్వరస్వామి ఆలయం వద్ద..


పెద్ద గుట్టపై మహా దీపం వెలిగిస్తున్న భక్తులు


వనపర్తిలోని రామలింగేశ్వర ఆలయంలో..

హరహర మహాదేవ.. శంభో శంకర

సాక్షి, నెట్‌వర్క్‌: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు ఉదయం నుంచి ఆలయాల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇరుముడిని శ్రీశైలం సన్నిధిలో స్వామివారికి సమర్పించి వచ్చిన మాలధారులు శివాలయాల్లో మాలను తొలగించారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సమయంలో భక్తులు ఆలయాల్లో భజనలు చేస్తూ జాగరణ చేశారు.

■ ఆత్మకూర్ మండలంలో బాలబ్రహ్మేశ్వరస్వామి, చెర్లపరమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు శివ లింగానికి అభిషేకాలు నిర్వహించారు. అలాగే షిర్డిసాయిబాబా ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

■ అమరచింత మండలంలోని చంద్రగఢ్‌లోని రామలింగేశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.


ఖిల్లాఘనపురంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

■ పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి, రేమద్దుల, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, గోప్లాపూర్, శాగాపూర్, మాందాపూర్, అన్నారం, చిక్కేపల్లి, కొత్తపేట గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

■ శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. గ్రామాల నుంచి భక్తులు సోమశిల, బీచుపల్లి, అలంపూర్ ఆలయాలకు తరలివెళ్లారు.


ఆత్మకూర్‌లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

■ వీపనగండ్ల మండలంలోని తూంకుంటలోని ఓంకారేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

■ గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గండి ఆలయంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గోపాల్‌పేటలోని శివాలయాలు, చెన్నారం, గొల్లపల్లి, రేవల్లి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

■ ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన వీభద్రస్వామి ఆలయం, సల్కెలాపురం రంగనాయకస్వామి ఆలయం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మండలంలోని పర్వతాపురం , గట్టుకాడిపల్లి లక్ష్మీఅలవేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, అప్పారెడ్డిపల్లి పెద్ద వాగు సమీపంలోని శివాలయం, సోళీపురం లక్ష్మీనర్సింహా యోగానంద స్వామి ఆలయం, ఖిల్లాఘనపురం కుర్వగేరి శివాలయం తదితర దేవాలయాల్లో భక్తులు ఉదయం నుంచి పూజలు నిర్వహించారు.


బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో..


అమరచింత శివాలయంలో..


వనపర్తి చింతల హనుమాన్ ఆలయంలో..


పామిరెడ్డిపల్లిలో భజన చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి గ్రామంలో ఈనెల 9, 10 తేదీల్లో సీపీఐ ఆధ్వర్యంలో మక్తల్ నియోజకవర్గ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి అబ్రహం తెలిపారు. రాజకీయ శిక్షణ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ, జిల్లా కార్యదర్శి విజయరాములు హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెబ్బేరు రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల వద్ద పట్టుకుని కేసు నమోదు చేశామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని పెద్దగూడెం వాగు నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను వనపర్తిలోని మెడికల్ కళాశాల వద్ద పోలీసులు ఆపి అనుమతి పత్రాలు అడుగగా.. పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవరు ముడావత్ శంకర్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా మండలంలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

చింతలకుంటలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్‌కుమార్ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా అంకురార్పణ, హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించి మహిళలు హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గట్టు జెడ్పీటీసీ బాసు శ్యామల, హనుమంతు నాయుడు, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, వాల్మీకి జిల్లా నాయకులు రమేష్‌నాయుడు, వైడింగ్ రాములు, మధుసూదన్‌బాబు, కోటేష్, రామాంజనేయులు, వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు, తాయప్ప, ధనుంజయ్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

అగరబత్తీల వితరణ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయానికి ఏడాది పాటు పూజలు చేసుకునేందుకు అగరబత్తీలను వాసవిక్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో పోలిశెట్టి ఉమాదేవి పూజారి ప్రవీణ్‌శర్మకు అందజేశారు.

యాసంగి పంటలకు నీరు విడుదల చేయాలి

పాన్‌గల్: మండలంలోని కేఎల్ఐ, భీమా కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వరచారి, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వల ద్వారా సాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందనే ఉద్దేశ్యంతో చాలా మంది రైతులు వందల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. సాగునీటి సరఫరా మధ్యలోనే నిలిచిపోవడంతో సాగుచేసిన పంటలు ఎండుమొఖం పట్టినట్లు వారు పేర్కొన్నారు. పంటలు చేతికందే దశలో ఎండుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి పంటలను కాపాడేందుకు కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేయాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బిల్యానాయక్, రైతు సంఘం నాయకులు మల్లేష్, శేఖర్, భీమయ్య, భగవంతు, బాబునాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైంది



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసం ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నదని, ఇదే మాసంలో దివ్యఖురాన్ అవతరించిందని ముఫ్తీ సయ్యద్ ఇబ్రహీం ఖాస్మీ, మౌలానా అబ్దుల్ రహ్మాన్ అన్వరి, మౌలానా అబ్దుల్‌అలీం అన్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు పట్టణంలోని మస్‌జిదే నూర్‌లో పవిత్ర రంజాన్ మాసం స్వాగతోత్సవం సందర్భంగా ధార్మిక సదస్సు నిర్వహించారు. రంజాన్ మాసంలో 30 రోజుల పాటు చేపట్టే ఉపవాసాల వల్ల పుణ్యంతోపాటు ఎన్నో రకాల లాభాలు ఉన్నాయని, రోగాలన్నీ నయమవుతాయన్నారు. రంజాన్ మాసంలో తమ వద్దనున్న సంపదలో 25 శాతం జకాత్ రూపంలో దాన ధర్మాలు చేయాలని, నిరుపేదలకు అండగా నిలువాలని ఆహార పదార్థాలతో పాటు దుస్తులను సమకూర్చాలని కోరారు. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహువసైల్లె వసల్లం సూక్తులను పాటించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, ప్రతినిత్యం ఐదుపూటలు నమాజ్ ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హాఫీజ్ జియాఉర్ రహ్మాన్ ఫహీమ్, హాఫీజ్ ముక్తదీర్, హాఫీస్ రఫియోద్దీన్, హాఫీజ్ ఫక్రుద్దీన్, షబ్బీర్, కలీం, వాహీద్, అమీర్, ఖమ్రుద్దీన్, నవీద్, మహిమూద్ ఉన్నారు.

11నుంచి పరమేశ్వరస్వామి జాతర



ఆత్మకూర్ చెరువులోని పరమేశ్వరస్వామి ఆలయం

- 464 ఏళ్ల క్రితం కొలువుదీరిన మహాదేవుడు
- వారం రోజుల పాటు ఉత్సవాలు
- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11, 12, 13 వ తేదీల్లో రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కన్నలపండుగగా జరుగనుంది.

చరిత్ర..

1560వ సంవత్సరంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఓ రైతుకు లింగం ఆకారంలో ఉన్న రాయి దొరికింది. ఆ రాయిని వ్యవసాయ పనులకు రైతు వినియోగించుకునేవారు. ఉదయం అయ్యేసరికి ఆ రాయి యధాస్థితికి వచ్చి ఉండేది. అనుమానం వచ్చిన ఆరైతు రాత్రి సమయంలో మేల్కొని గమనించాడు. సాక్షాత్తు పరమేశ్వరుడు స్వయంభూగా ఇక్కడ వెలిసినట్లు గుర్తించి ఆ లింగాన్ని అక్కడే ప్రతిష్ఠించి పూజలు చేయసాగారు. అనంతరం అప్పటి సంస్థానధీశులు ఆలయాన్ని నిర్మించి మహాశివరాత్రి అనంతరం వచ్చే అమావాస్య నుంచి జాతరను చేయడం ప్రారంభించారు. ఆత్మకూర్ సంస్థానాధీశుల కాలం నుంచి పరమేశ్వరస్వామి జాతర గతంలో ఘనంగా నిర్వహించేవారు. కొన్ని అనివార్య కారణాల వల్ల జాతర ప్రభ కోల్పోగా.. ఆత్మకూర్‌లో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి జాతర పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమ, మంగళ, బుధవారం రాత్రిల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతో పాటు పల్లకీసేవ, రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.


కొలువుదీరిన పరమేశ్వరుడు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కొత్తకోట రూరల్: సమాజంలో అనురాగం, ఆప్యాయత, ప్రేమ పంచడం మహిళకు సొంతమని, అందుకే మహిళ మానవాళికి మహోన్నత శిఖరమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలువురు వృద్ధ మహిళలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కుర్మక్క, శాంతమ్మ, ఎలిజబెతమ్మ, కర్రెమ్మ, జయమ్మ, సుందరమ్మ, కాంతమ్మ, శాంతమ్మ, వజ్రమ్మ, వెంకటమ్మ, భాగ్యమ్మ, కాంతమ్మ తదితరులు ఉన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కొత్తకోట ఎంపీపీ గుంత మౌనిక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఆటపాటలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గుంత మౌనిక పలువురు మహిళలను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

మహిళ పోలీసుల సేవలు భేష్

ఆత్మకూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, పోలీసు విధుల్లో మహిళా ఉద్యోగుల సేవలు ఉన్నతమైనవని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక సీఐ కార్యాలయంలో మహిళా పోలీసులను సత్కరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు పుష్ప, రాణి, సువర్ణ, నాగవేణి, కానిస్టేబుళ్లు బాలయ్య, ఇమాం, సిబ్బంది పాల్గొన్నారు.


వనపర్తిలో మహిళా కార్మికులు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: మహిళ సాధికరత కోసం పోరాటం కొనసాగించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ అన్నారు. జాతీయ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మహిళలు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రమేష్, కృష్ణవేణి, అనసూయ, జయశ్రీ, సువర్ణ, అమృత, సుమిత్ర, చిట్టెమ్మ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

దత్తాయిపల్లిలో..

పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి మండలంలోని దత్తాయిపల్లిలో ఉపాధి పని క్షేత్రం వద్ద పనులు చేస్తున్న మహిళ కూలీలతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు చేసుకునానరు. కార్యక్రమంలో పుష్పావతి, నాగేశ్వరి, నారమ్మ, బాలీశ్వర్మ, మన్నెమ్మ, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ నీలమ్మ, సుశీలమ్మను శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళ కార్మికులు, ఉపాధ్యాయులను, పలువురు మహిళా నాయకురాళ్లను సన్మానించారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మావతి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చెన్నపద్మ, ఏర్వ జమునరాణి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు వెంకటేశ్వరి, ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు హసీనా, అలివేలను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ బ్రహ్మం, రాంరెడ్డి, శ్రీనివాసులు, చంద్రపాల్‌రెడ్డి, చీర్ల శేఖర్, వాసంతి, నందిమల్ల అశోక్, పరంజ్యోతి, శారద, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బౌద్ధారెడ్డి, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ వారు ఎంఈఓ ఉషారాణితో పాటు 15 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లలిత, హెచ్ఎం శ్రీనివాసులు, క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి రాఘవేందర్ పాల్గొన్నారు.


ఆత్మకూర్‌లో..


వనపర్తిలో..


ఖిల్లాఘనపురంలో..


దత్తాయిపల్లిలో..

ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్‌లో శుక్రవారం నారమ్మగారి నర్సిరెడ్డి, శంకరమ్మ జ్ఞాపకార్థం షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, క్లబ్ అధ్యక్షుడు సత్యశీలారెడ్డి, సెక్రెటరీ కృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 21 ఏళ్లుగా నారమ్మగారి నర్సిరెడ్డి, శంకరమ్మల జ్ఞాపకార్థం షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో 90 జట్లు పోటీపడుతుండగా.. వారికి సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు సుబ్బిరెడ్డి మోహన్‌రెడ్డి, నారమ్మ కృష్ణారెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, కాంతారెడ్డి, ఉపాధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆవుల రమేష్, కోశాధికారి బాదం పాండు, ఎంసీ సభ్యులు జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, తిమ్మారెడ్డి, గుట్ట రవి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సభ్యులు